


"ఇది ఎందుకు రాశావ్?" కునికిపాట్లు పడుతున్న తులసిని కోపంగా కుదుపుతూ అడిగాడు కిశోర్.

"విన్నే, మొద్దూ...ఎందుకు రాశావిది?" మళ్ళీ కోపంగా రెట్టించాడు.

అలిసి నిద్రపోయిన తులసి ఉలిక్కిపడి లేచింది. ఎదురుగా ఎర్రటి కళ్ళతో రొప్పుతూ భర్త ... ఎప్పుడొచ్చాడో ఏమో ...

"విన్నే...ఎందుకు రాశావిది అంటే మాట్లాడవేం రాయిలా? ఎవర్ని ఉద్ధరిద్దామని ..."

"అందర్నీ ఉద్ధరించడానికి ఉన్నారుగా ... మీరూ, మీ రెండో పెళ్ళాం ... ల్లీ ..."

చెంప చెళ్ళుమంది తులసికి.

రాసిన కాగితాల్ని చించి విసురుగా వెళ్ళిపోయాడు కిశోర్. వెక్కి వెక్కి ఏడుస్తూ ముక్కలైన కాగితాల్ని ఒక్కొక్కటే పేర్చుకుని చదువుతుంది తులసి.

• • •

ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు భార్య తట్టతో మట్టి మోస్తుంది. ఏ క్లాస్ కంట్రాక్టరు కళ్ళతో కసి కసిగా ఆవిణ్ణి చూస్తూ తన కసి తీర్చుకుంటున్నాడు. ఇంజనీరుకి ఒళ్ళు మండిపోతోంది. అసలు ఇంజనీరూ, కంట్రాక్టరూ ఎన్నో ఎత్తుపల్లాల్ని సర్వేచేస్తూ, ఎందరో ఆడవాళ్ళ ఎత్తుపల్లాల్ని జాయింట్‌గా సర్వే చేశారు కూడా! అయినా, ఇది సొంత (పెళ్ళాం) వ్యవహారం మరి!

మెడికల్ ఆఫీసరు కూడా ఇంజనీర్ భార్యని తాకీ తాకనట్టు తాకుతూ — నుంచోమని, కూర్చోమని వివిధ భంగిమలలో ఫోటోలు తీస్తున్నాడు. ఏమీ చేయలేక ఇంజనీరుగారు పళ్ళికిలిస్తున్నారు.

ఆయనకోపం ఇంటావిడ మీదకు మళ్ళింది. సింగ్‌గాడి పెళ్ళాంలాగ చెట్టు కింద కూర్చుని పేకాడ కూడదూ? టింగ్‌రంగా అంటూ దీన్నసలు తట్టెవరు ఎత్తుకోమన్నారు అని విసుక్కున్నాడు. ఎం. ఎ. చదువుకున్న ఇంజనీర్ భార్య మొగుడి మనోభావాల్ని చదివేసింది.

కినుక్కున నవ్వి, మొగుణ్ణి కవ్వించాలని మరో

తట్టుంచుకుని వయ్యారంగా నడుస్తుంది. ఆమె అపర చండిక. కాని, కంట్రాక్టర్ భార్య రమాదేవికి ముందు చూపు ఉంది. అనక ఇంజనీరు ఆఫీసులో బిల్లులమీద అర్జెంటు పెడతాడని మొగుణ్ణి కళ్ళతో కోప్పడింది. పెళ్ళాం చూపుతో కళ్ళు తిప్పుకున్నాడు కంట్రాక్టర్. ఆయన చీఫ్ ఇంజనీరుకి భయపడడు గాని, ఇంట్లో రోజువారీ కూలీ! ఆయనకు వచ్చింది బంగారం బాగా దిగేసుకొచ్చిన రమాదేవి కాదు. ఆమె తెచ్చిన కట్నమూ కాదు. ఆమె వచ్చిన వేళ! పార్టనర్‌కి మందు పెట్టి చంపిన కేసు రమాదేవి ఇంట్లో అడుగు పెట్టిన రోజునే కొట్టేశారు. పెట్టిన మందుకి నోరు లేదు. సాక్షులకు డబ్బు చేదుగాదు. చచ్చినవాడు కోర్టుకి తిరిగి రాలేదు. కోర్టుకి చెవులేగాని కళ్ళులేవు. రమ్మీ వచ్చినప్పట్నుంచి ఆయన రమ్మీ ఆటలో కూడా రాణిస్తున్నాడని వినికిడి.

ఆ ఫాషన్ పెరేడ్‌లో పాల్గొన్నది ఇంజనీరు భార్య ఒక్కతేగాదు. ఎన్నెన్నో సీతాకోక చిలకలు షిఫాన్ చీరల్లో సింగారించుకున్నాయి. మగాళ్ళు గుసగుసలతో మట్టి పెళ్ళగిస్తుంటే ఆడవాళ్ళు ఎత్తుతున్నారు. రెండు చేతులెత్తి తట్టలో మట్టి మోస్తున్న ప్రతి ఆడదాన్ని మగాళ్ళు లొట్టలేస్తూ చూస్తూనే ఉన్నారు.


"మాటింగేట్రా?"

"ఎర్రినాయాల! ఎదవ పెశ్న శేయకు. అదింగ్‌లు కోటింగ్‌లు కొట్టకొచ్చినారు గంద. అదిగో అలమ్మ తట్టతో మట్టెట్టుకొచ్చి, చెట్టుసాటు కెళ్ళి మొహానికి పౌడరు మళ్ళీ అద్దుకుని మరీ మట్టి మోస్తుంది గంద. ఫోటో మీద ఫోటో తీస్తున్నారుగంద.

మాటింగ్ కాకపోతే మరేటంటావ్?".

నవ్వుకుంది తులసి. అవును—వీళ్ళంతా నటులే. కాని, ఈ వెగటు వేషగాళ్ళ కంటే పగటి వేషగాళ్ళే పదిరెట్లు నయం. అదిగో ఆయనే హీరో. పేరు రంగారావు. మైనారిటీ మెజారిటీని పరిపాలిస్తున్న, ప్రపంచంలోకల్లా పెద్దదయిన ఈ ప్రజాస్వామ్య దేశంలో ఆయ నో ప్రజా నాయకుడు! పేకాటలో ఓడిపోయినపుడు కమ్యూనిజం, నెగ్గినపుడు కాపిటలిజమ్ బావుంటుందనే గొప్ప సోషలిస్టు! పాలిస్టర్ క్లాత్ కంటే ఖరీదైన ఖద్దరు కట్టే అసలైన గాంధియవాది! తనకు వ్యతిరేకంగా నోరెత్తే కుర్ర నాయకుల పుర్రెలను రాత్రికి రాత్రే ఎగరగొట్టే అహింసా మూర్తి! మురికి కంపు రాజకీయాలకు ముసలితనం లేదు కాబట్టి ఆయన చాలా యువ్వనుడు, యాభై ఏళ్ళు పైబడినా. అయితేనేం మొన్నమొన్ననే ఒక చక్కని చిన్నదాన్ని అర్జెంటుగా అనుభవించి, హైదరాబాదులో ఒక కుర్ర నాయకుడికి అంటగట్టబోయాడు. అబలా ఒప్పుకోనందుకు ఆయన, ఆయన మిత్రుడు చెరిచి హోటల్ మూడో అంతస్తు నుంచి గెంటేసినప్పుడు ఆ నాయకుడు కటకటాల వెనక్కి వెళ్ళడం ఖాయమని కొందరనుకున్నారు. కాని, ఆతను హత్యని అన్ని డిపార్ట్‌మెంట్ వాళ్ళచేత ఆత్మహత్య అని పదే పదిసార్లు అనిపించగలిగాడు! అది హత్యేనని రాసిన ఒక లేడీ రిపోర్టర్‌ని ఒకానొక దినపత్రిక కార్యాలయం లోంచి బయటికి గెంటించగలిగాడు. హత్యచేయబడిన అభాగ్యురాలి బట్టలన్నీ వీర్యం కంపు కొడుతున్నా, ఆమె రొమ్ముల మీద గీతలున్నా, మతి స్థిమితం లేక ఆమె తాగి దూకి ఆత్మహత్య చేసుకుందని రాయించ గలిగాడంటే వీడి కడుపుడకా అసాధ్య దనుకున్నారు. ఈ పుణ్యభూమిలో జరిగిన దారుణాన్ని చూసి బెంబేలుపడి టాక్సీని గోడకు గుద్దిన టాక్సీ డ్రైవర్ని—హత్యను చూసిన ఒకే ఒక సాక్షిని—రేష్ డ్రైవింగ్ కింద అరెస్టు చేయించి నోరుమూయించాడు. అటువంటి హీరోకి కుడి భుజం, అతనికూడా తిరుగుతూ హడావుడి చేస్తున్న లాయరుగారు. హీరోగారు ఎన్నో సార్లు శ్రీ కృష్ణ జన్మస్థానానికి వెళ్ళకుండా చక్రం అడ్డం తిప్పవే! నల్ల కోటు లాయరుకి నల్ల డబ్బు ఎక్కువై ఈమధ్యనే తెల్ల టోపీ పెట్టుకుంటున్నాడు. అందుకే ఈ మధ్యన నాయకులకు న్యాయస్థానాలు సలాము చెయ్యాలనికూడా వాదిస్తున్నాడు."

గుసగుసంతో కుస్తీ పడుతూ రంగారావుచూస్తున్నా, లేకపోయినా వంగి వంగి నమస్కరిస్తున్న వారు యూనివర్శిటీ రీడరు! యూనివర్శిటీలో తన "కుల




సంఘా"నికి ఆయనే పెద్ద. ఒక చేత్తో 'కన్యారత్నాన్ని', మరో చేత్తో 'బంగారు పతకాన్ని' పాత ప్రొఫెసర్ని కాకా పట్టి సంపాదించి ఉండకపోతే తను రీడరుగా తగలబడే వాడు కాదని తన కంటే స్మగుల్డ్ బిజినెస్ చేస్తున్న యూనివర్శిటీ అవుట్ గేట్ అయ్యారే వెయ్యి రెట్లు నయమని బహిరంగంగా బాధ పడుతుంటా రాయన! పిల్లలకు పాఠాలు చెప్పడం కంటె ఆయన ధ్యాసంతా బాంక్ బేలన్స్ మీదే! డాక్టరేట్ చేయడం కంటే రిజిస్ట్రార్ ఆఫీసులో గంట కింతని కాన్ఫిడెన్షియల్ డ్యూటీయే లాభసాటి అనిపించిం దాయనకు!

అసలు ఆంతరిక మదింపు ఉన్న ఆ విశ్వవిద్యాలయంలోని రీడరు తన (కులం) కుర్రాళ్ళ చేత అంతకుమించి పదింతలు రోడ్ను వేయించగలడు! కంట్రాక్టర్ ఇంజనీరు తలచుకుంటే సరేసరి. జిల్లా మెడికల్ ఆఫీసరు తనింట్లో పని చేస్తున్న వార్డు బాయ్‌లను ఒక రోజు పంపితే చాలు—ఇంతకు మించే పని చెయ్యగలరు!

కాని, రంగారావుని మెప్పించడ మెలాగు? అందులోకి ఆయనకు ముందు రాత్రే ఢిల్లీ నుంచి ఫోన్ వొచ్చిందట! హైదరాబాద్ నుంచి మనిషికూడా వచ్చాడట! అప్పటినుంచీ రంగారావులో రీడర్‌గారికి వైస్ చాన్సెలర్ కనిపిస్తుంటే ఇంజనీర్‌కి కంట్రాక్టర్ పబ్లిక్ వర్క్స్ మంత్రి, జిల్లా మెడికల్ ఆఫీసరుకి ఆరోగ్యమంత్రి కనపడుతున్నారు.

ఇలా ఒక్కొక్కరికీ ఒక్కో రూపంలో దర్శనమిస్తున్నారు రంగారావుగారు! డాక్టరేట్ లేని రీడరుకి ప్రొఫెసరు కావాలి, కంట్రాక్టరుకి ఇంకా బోలెడన్ని కాంట్రాక్టులు కావాలి, ఇంజనీర్‌కి తన మీదున్న విజిలెన్స్ కేసులన్నీ ఎత్తేయాలి, మెడికల్ ఆఫీసరుకి ప్రపంచ ఆరోగ్యసంస్థ వారి ఫెలోషిప్పు కావాలి ఇలా ఒక్కొక్కరికీ ఒక్కొక్క కక్కుర్తి. అస లక్కడికి వచ్చిన వాళ్ళందరికీ ఒక్కొక్క వింత కోరిక. కొత్త పేకముక్కలు కొన్న ఇన్‌కంటాక్స్ ఆఫీసరు చతుర్ముఖ పారాయణం చేద్దామని వచ్చాడు. ఎక్సయిజు సూపరింటెండెంట్ బీర (బీరు) కాయల్ని, సార (సారా) కాయల్ని ఆ పల్లెటూళ్ళో దట్టంగా పట్టించమని వచ్చాడు. బీరు, సారా దొరకక పోతే ఏ తాటిచెట్టు కింద చేయి చాపినా పట్నవాసపు బుల్లోడని ఆ పల్లెటూళ్ళో కల్లు పోస్తారన్న దీమ ముందుకు నెట్టింది. పి. టి. ఒ. శ్యామప్రసాద్ హాలీవుడ్ తారలు కోసం వచ్చాడు. అతనికి హాలీవుడ్ తారలంటే అమెరికా తారలు మాత్రమే కాదు. జాకెట్టు లేకుండా పల్లెల్లో ఎత్తు పల్లాల్ని కనపడేటట్టు చీర చుట్టుకునే వాళ్ళంతా హాలీవుడ్ తారలే! పిక్‌నిక్ వెళ్ళి చాలా రోజులైంది ఈ వంకతోనైనా ఆ కోరిక తీర్చుకోడానికి వచ్చింది ఎస్. పి. భార్య సుమతి!

ఇంతలో గలాటా ప్రారంభమైంది. పత్రికల వాళ్ళు వచ్చారు కెమెరాలతో. అందరూ రంగారావు పక్కన నుంచుని ఫోటో దిగుదా మన్నవారే. ఆడవాళ్ళు కూడా ఆయన పక్కన నిలుచుని ఫోటో దిగడానికి పోటీ పడుతున్నారు! ఫోటో తతంగం అయిన తరవాత పనికి జనం సలచబడ్డారు. అసలు మరి...హాజరు పట్టీలో సంతకం పెట్టిన జనాభా పని చేయడానికి ఉండ రీ దేశంలో!

కెవ్వుమని కేక.

ఉన్నట్టుండి అక్కడి జరుగుతున్నపని హఠాత్తుగా ఆగిపోయింది. ప్రెసిడెంట్ రంగారావుగారి పాకార్డు భార్యకు గిరుకు పోయిందట. వంగివంగి నమస్కారాలు

చేస్తున్న వాళ్ళే ఆవి డాయనకు ఉంపుడు గత్తె అని ఒప్పుకుంటారుకూడా!

డెట్టాల్ కోసం కంగారుగా పరుగెత్తి కార్లోని ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ని బద్దలు కొట్టా డో ఆఫీసరు ప్రబుద్ధుడు. ప్రెసిడెంట్‌గారి పట్టుపురాణీకి గొప్పకి,పట్టు చీర చింపి కట్టు కట్టింది దో పూబోణి! గునపాన్ని పాపం తిట్టి పోశారు కొంతమంది. ఆ భారీ శరీరాన్ని ఏలాగోలా సాయం పట్టి కారులో కూర్చో పెట్టి విశ్రాంతి తీసుకోమన్నారు ఏకగ్రీవంగా, అందరూ.

గర్వంగా, తృప్తిగా, మత్తుగా చూసిం దామె రంగారావు వైపు! వెధవలు చేయక ఏం చేస్తార్లే అన్నట్టు చూశాడు రంగారావు దీనాగా.

రంగారావు దగ్గర అంతమంది పెద్ద పెద్ద పదవు లున్న పెద్ద మనుషులు ఒదిగి ఒదిగి చేతులు నలపడం చూస్తే దేశంలో అధికారానికి, అర్హతకు మించి హారతి పడుతుంది చదువు రాని మొద్దులు కాదు. స్వార్థపరులైన చదువుకున్న ఎద్దులే అనిపించింది తులసికి.

తులసి నిజంగా ఆ గంజాయి వనంలో తులసి మొక్కే!

● ● ● ●

భర్త టేబుల్ మీదున్న కాగితాల్ని సర్దుతూ ఒక చోట ఆగిపోయింది తులసి. "మురికి పేటలో ఇళ్ళు కాలిపోయిన వాళ్ళకు పంచిన అల్యూమినియమ్ గిన్నెల విలువ అయిదు వందలు. అవి పంచి పెడు తున్నప్పుడు తీసిన ఫొటోల ఖర్చు అయిదు వందలే!

మరో కాగితం చూసి అదిరి పడింది తులసి—

"నిన్న శ్రమదానానికి అయిదు వేలు ఖర్చా?"

ఆశ్చర్యపోయింది.అర ఫర్లాంగుకూడా ఉండదేమో! మట్టి రోడ్డు!—మరో రశీదు చూసింది.

"వినోద కార్యక్రమాలకు మూడు వేలు" అవును మరి రోజంతా అలిసిపోయిన వారి నందరినీ తెలుపు. నలుపు గుర్రాల మీద కెక్కించడానికి అయిన ఖర్చు.

దానం చేస్తే ఖర్చయే మాట వాస్తవమే! కాని, దానం చేసింది శ్రమను! అది శ్రమదానం.

అవును మరి...పెద్దవాళ్ళ చెమటకూడా చాలా ఖరీదుగా మరి!

ఇంకో రశీదు—


"ప్రకటనల ఖర్చు. వెయ్యి రూపాయలు." కుడి చేయి చేసిన దానం ఎడమ చేయికి తెలియకూడ దంటారు. కాని, బాగా బలిసిన కుడి, ఎడమ చేతులు చేసిన దానాన్ని ప్రకటించుకోడానికి అయిన ఖర్చన్న మాట అది.

క్లబ్ డబ్బుకి, తన డబ్బుకి తేడా కోశాధికారికి ఏ కోశమైనా తెలియదేమో! డబ్బుని 'రంగునీళ్ళ' ప్రాయంగా ఖర్చు పెట్టాడు.

ట్రెజరర్ ఎవరో కాదు తన...భర్తే!

మనసంతా వికలమైపోయింది తులసికి. పడుకుని మంచం మీద దొర్లుతుందే గాని నిద్రపోవడంలేదు. ఆలోచనలకు అంతులేకుండా పోయింది.

అన్నట్టు అక్కడ పుల్ల లేరుకుంటూ పిల్లలకి కనిపించింది రత్తి. ఇల్లు కడుతున్నప్పుడు రోజు కూలీ కొచ్చిన రత్తి.




"రండమ్మగోరూ! రండమ్మగోరూ!" నులక మంచం వాల్చింది.

"ఏటలా సూ త్తున్నావ్...మనమ్మగోరు. నాలు కొబ్బరిబొండాలు దించు. తాటిపెళ్ళెక్కు. మునుజి కళ్ళుదించు ఏటలా కట్రాటలా నిలబడిపోయావ్ ... మొగుణ్ణి ఆజ్ఞాపించింది రత్తి. నవ్వుకుంది తను.

కాళ్ళు చేతుల మీద నీళ్ళు పోసింది రత్తి. తను కిష్టంలేకపోయినా భర్త బలవంతం మీద పారతో మట్టి తవ్వడం వలన చేతులు బొబ్బలెక్కాయి.

"అమ్మాయిగోరూ! దూరాన్నుంచి మిమ్మల్ని గుర్తుపట్ట లేదంటే నమ్మండమ్మా ...'

చుట్టూ చూసింది తను.

ఆబగా అంబలి తాగుతున్నారు రత్తి పిల్లలు.

"ఏం సేయమంటారు, అమ్మగోరూ! మాయి కూలి బతుకులు. ఆర్నెల్ల నుంచీ పన్లేక మాడి సత్తన్నా ... మీరేటి అనుకోనంటే ఒక మాట సెపుతా ... ఇయ్యాల మాకు మీరు పోటీ ... మా కూలోళ్ళ కడుపులు కొట్టారంటే నమ్మండి ..."

రత్తి పుండుమీద నీళ్ళు పోస్తున్నా తనకు కారం చల్లుతున్నట్టయింది!

నిద్రపట్టక మంచినీళ్ళు తాగి మళ్ళీ పడుకుంది తులసి. ఆలోచనలు వెన్నంటుతున్నాయి.

స్వయం ఉపాధి పథకం కింద క్రితం ఏడే ఫాక్టరీ పెట్టినా, క్లబ్ పరిచయాలతో లక్షలకు లక్షలు గడించెయ్యాలంటాడు భర్త కిశోర్! కాని తనకు క్లబ్ అంటే ఎలర్జీ.

నోటితో పలకరించుకుని, నొసటితో వెక్కిరించుకుంటూ రక్కడ జనం!

భర్త బలవంతం మీద రెండు మూడుసార్లు మాత్రమే వెళ్ళింది క్లబ్‌కు తను.

"సినీ యాక్టర్ జోహార్ ఏమన్నాడో తెల్సా?

వర్కింగ్ పార్ట్‌నర్ టాక్సు కట్టడం, స్లీపింగ్ పార్ట్‌నర్ అన్ని లాభాలు పొందడం — ఒక్క పెళ్ళనే బిజినెస్‌లో మాత్రమే ..."

"ఇన్నాళ్టికి జోకరు జోకు వేయలేదు."

"నగ్న కార్యంలోని నగ్న సత్యం ఒకటి చెప్పాడు."

నవ్వులు ... నవ్వులు ... చప్పట్లు ... చప్పట్లు.

ఇంగ్లీషులో బూతు ప్రసంగాలు ... బ్లూ సినిమాలు (ఆక్‌కోర్స్ ఆహ్వానితులకు మాత్రమే!)

"మరీ బోర్‌గా ఉంది, గురూ! వైఫ్ స్వాపింగ్ గేమ్ మొదలెడదామా క్లబ్‌లో ..."

"అంటే?"

"ఒరేయ్ ట్యూబ్ లైటూ! ఏముందీ... కారు తాళాలతో లాటరీ వేసుకోవాలి. ఎవడికి దొరికిన కీతో వాడు కారు దగ్గరికి వెళ్తే కారు లోపల ఉంటుంది కారుగలవాడి పెళ్ళాం. వారం రోజుల వరకూ కారూ, పెళ్ళాం చేతిలో కీ గలవాడివే!"

"వారం రోజుల తర్వాత?"

"వెరీ సింపుల్—మళ్ళీ లాటరీ!"

"అబ్బ వండర్‌ఫుల్ ... బెటర్ లేట్ దేన్ నెవర్ ..." చప్పట్లు ... చప్పట్లు ...

కారునలుపు పెళ్ళాలు, డొక్కు కారున్నవాళ్ళూ చాలా మంది మెంబర్లు ముందు కురికారు. మళ్ళీ క్లబ్ గుమ్మం తొక్కలేదు తను!

నిజం చెప్పాలంటే డబ్బు జబ్బు పట్టుకున్న వాళ్ళంతా క్లబ్ మెంబర్లు. ఒకడి జబ్బ మరొకడు పట్టుకుని దబ్బున పైకెళ్ళిపోవాలన్నదే వాళ్ళ లక్ష్యం!

ఆ అంతర్జాతీయ సేవా సంస్థలో సభ్యు లందరూ ఒకరి కొకరు మాత్రమే సేవచేసు కుంటూ ఉంటారు. నల్ల డబ్బున్న సభ్యులు తెలుపుని తెలుపు చేసుకునే బాంక్! మూలుగుతున్న ధనాన్ని అప్పులిచ్చి ఒకటికి పదింతలు చేసుకునే వ్యాపారసంస్థ!

అతిథి ప్రసంగాలకు పై అధికార్లను పిలిచి వారేమి చెప్పినా చప్పట్లు కొట్టి, జేజేలు కొట్టించి కాకా పట్టడానికి ఉపయోగపడే ఆయుధం!

'అనాథుల సేవే మా పరమావధి' అనే నినాదం మెంబర్ల ఉన్నతికి పునాదులు తేవుకునే సాధనం! అభాగ్యుల పల్లెలకు వారేసిన మట్టి రోడ్డు భవిష్యత్తుకి వారేసుకున్న బంగారు బాట!

ఆవేశంతో పొంగిపోతూ కలం కాగితాలు అందుకుంది తులసి.

● ● ●

పట్టణంలో —

మర్నాడు దినపత్రికలు—"అంతర్జాతీయ సేవా సంస్థ వారి శ్రమదానం" పతాక శీర్షికలతో ప్రచురించాయి. ఫోటోలు ... ప్రత్యేక వార్తలు... వ్యాసాలు ... ఆ ఫోటోల కిందే తను రాసిన కథ అచ్చయి ఉంటే ... తన కొచ్చిన ఆలోచనకు పిచ్చిగా నవ్వుకుంది తులసి. శ్రమదానంలో తీసిన ఫోటోలతో క్లబ్ మెంబర్ల ఆల్బమ్‌ లన్నీ నిండిపోయాయి.

పేపరు కటింగ్స్‌తోపాటు శ్రమదానం తాలూకు ఫోటోలు క్లబ్ రికార్డుల్లో శాశ్వతంగా చోటుచేసుకున్నాయి.

పల్లెలో —

"మావోయ్!

వి స్నేసిన మట్టిరోడ్డు అప్పుడే కొట్టుకెళ్ళిపోనాది. అడ్డమైన దార్లంట ఎల్లి పైకొచ్చినోళ్ళు తప్పుడు దార్లు తొక్కుతున్నోళ్ళు యేసిన దార్ని మనలాటోళ్ళు తొక్కకూడ దనేమో దేవుడు తెగ వరసం కురిపించేత్తన్నాడు!"

రత్తి పకపకా నవ్వింది.!

*